క్లుప్తంగా

వేర్వేరు సమయాల్లో రెండు రోడ్డు ప్రమాదాలు

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో నూతన సంవత్సరం మొదటిరోజున ఆదివారం వేర్వేరు సమయాల్లో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కళ్యాణదుర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ కారులో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వెళ్తుండగా, ఉన్నపళంగా కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. మరో పది నిమిషాలకు ఆత్మకూరుసమీపంలో ఓ దాబా వద్ద ఆత్మకూరుకు చెందిన డిష్ శివారెడ్డి స్కూటీపై వెళ్తుండగా, కళ్యాణదుర్గం వెళ్తున్న కర్ణాటక బస్సు ఢీకొంది. స్థానికులు అతన్ని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తరచూ బైపాస్ వెంట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులకు సర్దిచెప్పారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

అనంతపురం సిటీ: అన్నం పరబ్రహ్మ స్వరూపమని 'దిశ' డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం అనంతపురం క్లబ్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాల నిల్వ ఉంచే ఫ్రిడ్జ్‌ను ఆయన ప్రారంభించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, శుభ కార్యాలు మొదలుకొని ఎక్కడైనా సరే, మిగులు ఆహార పదార్థాలను పడేయకుండా ఇక్కడికి తెచ్చిస్తే అన్నార్థుల ఆకలితీర్చినట్లవుతుందన్నారు. అనంతపురం క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి, ఫ్రిడ్జ్‌ను వితరణ చేసిన చంద్రకాత్‌నాయుడును డీఎస్పీ అభినందించారు. జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, రమేష్, ఇషాక్ అలీ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

రాప్తాడురూరల్: అనంతపురం మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని ఆటోకాలనీకి చెందిన ఆటోడ్రైవరు కుళ్లాయి కుటుంబానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.50వేలు ఆర్థికసాయం ప్రకటించారు. కుళ్లాయి మృతిచెందడంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని సర్పంచ్ సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బండి పవన్, నాయకులు ఆదినారాయణ, తిరుపాల్‌రెడ్డి, రామాంజనరెడ్డి, చంద్రశేఖర్, డీలర్ పెదయ్య, నాగరాజు, పురుషోత్తం, ప్రసాద్, నల్లప్ప, రామాంజి, మస్తాన్ తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఆదివారం సర్పంచ్, మండల కన్వీనర్, ఇతర నాయకులు వెళ్లి కుళ్లాయి భార్యకు అందజేశారు.

అనాథల మధ్య వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని బస్టాండ్ రోడ్డు వద్ద పలు అనాథాశ్రమాలకు చెందిన 60 మంది చిన్నారుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరిపారు. చిన్నారులకు స్కూల్ బ్యాగులను, నూతన వస్త్రాలు అందించారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి సుబ్రమణ్య కుమార్, మాజీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు. మునిరత్నం శ్రీనివాసులు బెడ్‌షీట్లు, వసంతకుమార్ జైన్ దుస్తులు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

వైభవంగా కల్పతరు మహోత్సవం

అనంతపురం కల్చరల్: అనంత వాసులు 2023 సంవత్సరానికి ఆదివారం ఆనందోత్సాహాలతో స్వాగతం పలికారు. నగర వీధుల్లో విద్యార్థులు, యువకులు సందడి చేశారు. జిల్లా రంగస్థల కళాకారులు ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరితతో కలిసి సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు చామలూరు రాజగోపాల్, ఎల్కేపి అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య తదితరులు మాట్లాడారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు ముతవల్లి కేఎం షఫీవుల్లాను మత పెద్దలు సన్మానించారు. కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో పాస్టర్ మనుష్యే ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో కల్పతరు మహోత్సవం జరిగింది.

పింఛన్ అందజేసిన మేయర్



38వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: 38వ డివిజన్‌లో మేయర్ వసీం ఆదివారం ఉదయం పింఛన్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 41వ డివిజన్‌లో మేయర్ హైమాస్ లైట్లు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు గోగుల లక్ష్మిదేవి, కమల్‌భూషణ్, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, డివిజన్ కన్వీనర్ ఖాజా, నాయకులు రాధాకృష్ణ, రామచంద్ర, రవి, కైలాష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

అనంతపురం కల్చరల్: స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీస్ ప్రాంగణంలో లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ ఆధ్వర్యంలో 150 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. వందలాది మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు అసిఫుద్దీన్, లక్ష్మీనారాయణ, నబీరసూల్, షరీఫ్ తదితరులు మాట్లాడారు.

నూతనోత్సాహం కనిపింఛన్

- 'పింఛన్ కానుక' పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వైఎస్సార్ పెంఛన్ కానుక కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని పెంచింది..అందులోనూ కొత్త సంవత్సరంలో 'కానుక'గా పంపిణీ చేయడంతో లబ్ధిదారుల మోములో నూతనోత్సాహం నిండింది. ఆదివారం నగరశివారు గుత్తి రోడ్డులోని విద్యుత్ కళాభారతిలో 'వైఎస్సార్ పింఛన్ కానుక' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1996 చంద్రబాబు హయాంలో పింఛన్ అందాలంటే ఎవరైనా మరణిస్తేనే వారి స్థానంలో మరొకరికి మంజూరు చేసే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ హయాంలో అర్హతే ప్రామాణికంగా పింఛన్ పంపిణీ చేసి, లబ్ధిదారుల్లో భరోసా కల్పించారన్నారు. 2014లో టీడీపీ అధినేత చంద్రబాబు రూ.2వేలు పింఛన్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఉంచి, ప్రచారం చేసి, మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదేళ్లలో రూ.3వేలు పింఛన్ చేస్తామని చెప్పారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం పింఛన్ రూ.2,750 పంపిణీ చేశామన్నారు. కొత్తగా 920 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, తదితర పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నంత వరకూ సంక్షేమం, అభివృద్ధి ఆగదు అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కే భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, లాలు, ఇస్సాక్, మునిశేఖర్, రహంతుల్లా, నరసింహులు, సుజాత, జయలలిత, లీలావతి, రామాంజనమ్మ, చంద్రలేఖ, కో ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, నాయకులు రాధాకృష్ణ, కుళ్లాయస్వామి, నాగార్జున రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 20 మంది చేరిక



వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో చేరిన టీడీపీ నాయకులు

రాప్తాడు: మరూరుకు చెందిన 20 మంది టీడీపీ నాయకులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో గంజి పెద్ద నరసింహుడు, గంజి నాగేంద్ర, ఆణాలు పెద్ద నరసింహుడు, వెట్టి శ్రీనివాసులుతో పాటు వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచినేని చెన్నారెడ్డి, మాజీ సర్పంచు సాకే వెంకటేష్, గ్రామ సచివాలయ కన్వీనర్లు కరుణాకర్, హరికృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బుడగ పరుశురాముడు, గంజి నరేష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పార్టీకోసం శ్రమించినా గుర్తింపులేదని, తన సామాజిక వర్గానికి చెందిన వారికే పరిటాల కుటుంబం ప్రాధాన్యత ఇస్తూ వచ్చారన్నారు. ఇటీవల మాజీ మంత్రి పరిటాల సునీత దళిత మహిళపై దౌర్జన్యం చేశారన్నారు. ఆదే రోజు మరూరులో బీసీ నాయకుడు రామాంజనేయులుతో కాళ్లు మొక్కించుకోవడం చూస్తే టీడీపీలో ఉంటే ఇలాగే జరిగే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలు పట్ల ఆకర్షితులమైనట్లు తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: నగరంలోని 46వ డివిజన్‌లోని రెండో రోడ్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని విఠోబ గుడి నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. అనంతరం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు చేశారు. మంజునాథ స్వామి, వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

రాప్తాడు: మండల కేంద్రంలో లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి ఆలయంలో ఈ నెల 2న వైకుంఠ ఏకాదశి పూజా మహోత్సవం (ముక్కోటి ఏకాదశి) ఏర్పాట్లను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ గంజి రాముడు పరిశీలించారు. ఆలయం దగ్గర ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్నదానం కార్యక్రమం ఉంటుంది.

విశాల హృదయుడు జగనన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- కొత్త పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాల హృదయుడు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింట్‌ఆన్స్ స్కూల్‌లో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ల కోసం నెలకు రూ.400 కోట్లు ఇస్తే, ఇప్పుడు నెలకు రూ.1,800 కోట్లు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో 28 లక్షల పింఛన్లు ఇస్తే, ఇప్పుడు 65 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో మండల కార్యాలయాలకు వెళ్లి పింఛన్ల కోసం పడిగాపులు కాసేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతినెలా 1 తేదీ ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో కొత్తగా 685 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం 16,813 మందికి పింఛన్లు ఇస్తున్నామని, ఇది జిల్లా రికార్డు అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ మండలంలోనూ ఇన్ని పింఛన్లు రాలేదన్నారు.

పేదవాడి కష్టాన్ని తీర్చే అసలైన హీరో జగన్ : ఇంటింటికీ వలంటీర్లను పంపి పేదవాడి కష్టాలను తెలుసుకుని వాటిని తీర్చుతున్న జగన్‌మోహన్‌రెడ్డి అసలైన హీరో అన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ విమర్శలు చేయడం సరికాదన్నారు. అనంతపురం రూరల్ మండలంలో 23,412 మందికి ఇంటి పట్టాలిచ్చామన్నారు. రూ. 15 కోట్లతో 10 వేలమంది పాడి రైతులకు తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్య తీర్చేందుకు పీఏబీఆర్ నుంచి నేరుగా పైపులైను ఏర్పాటు చేసేందుకు రూ. 69 కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, వైస్ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, సర్పంచ్ తేజేశ్వణి, నాయకులు ధనుంజయయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు వడ్డే శీనా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, యూత్ మండల కన్వీనర్ డాక్టర్ శీనా, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అవ్వాతాతల మోముల్లో చిరునవ్వు

రాప్తాడు: అవ్వా, తాతల మోముల్లో చిరునవ్వు చూసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ల పెంపు కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాప్తాడులోని ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పెంపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పింఛన్ దారులతో క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 1,700 మంది, రాప్తాడు మండలంలో 214 మందికి నూతన పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. గతంలో 5,743 మంది ఇస్తుండగా, ప్రస్తుతం మొత్తం 6,012 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండా రెడ్డి, ఎంపీడీఓ సాల్మన్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధమ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్లు చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, గ్రామ వలంటీర్లు, పార్టీ సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.



జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వీధి రౌడీలా మాట్లాడితే తీవ్ర పరిణామాలు

- పరిటాల శ్రీరామ్‌ను హెచ్చరించిన తోపుదుర్తి నయనతారెడ్డి



సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పరిటాల శ్రీరామ్.. వీధిరౌడీలా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్వీ యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి హెచ్చరించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి మీకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. మూడోకన్ను తెరిస్తే ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కనబడకుండా పోతాడని అంటున్నావ్.. తోపుదుర్తి సోదరులు ముగ్గురు కళ్లు తెరిస్తే భస్మమైపోతావని మండిపడ్డారు. ఆదివారం ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో లబ్ధిదారులకు పింఛన్ మొత్తం పెంపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగనన్న చిత్ర పటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక మహిళ సహకార డైయిరీ గురించి మాట్లాడడం సరికాదన్నారు. రామగిరి మండలం నసనకోటలోనే సమావేశం నిర్వహిస్తానని, నీకు దమ్మంటే అడ్డుకో అని సవాల్ విసిరారు. లక్ష ఎకరాలకు నీరు ఇచ్చే సంకల్పంతో ప్రకాష్‌రెడ్డి పని చేశారని, నీలా ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తూ, అక్రమంగా రూ.కోట్లకు పడగలెత్తలేదన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.2,750 పింఛన్ అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత,వైస్ ఎంపీపీ విజయ్, నీలిమ, సర్పంచ్‌లు వరలక్ష్మి, ఎర్రిస్వామి, ఓబులేష్, తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, వాసుదేవరెడ్డి, గోపాల్‌రెడ్డి, భాస్కర్, ఫణిరెడ్డి, మన్సూర్‌వలి, అతికిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ సందడి





ఎంపీ రంగయ్యకు శుభాకాంక్షలు చెబుతున్న ప్రొఫెసర్లు, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి





ఎమ్మెల్యే అనంత, ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



వేడుకలు జరుపుకుంటున్న డీసీసీబీ సిబ్బంది



బీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు



గురునాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

రాప్తాడురూరల్/ రాప్తాడు: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసం వద్ద ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల నుంచి ప్రజలు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ బోర్డు మెంబరు తోపుదుర్తి నయనతారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎస్‌వీయూ బోర్డ్ మెంబర్ నయనతా రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చందు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఐడీసీసీ మాజీ చైర్మన్ నల్లపరెడ్డిని కలిసి వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రైతు విభాగం రాష్ట్ర వ్యవసాయశాఖ మిషన్ కార్యదర్శి ఆగ్రోస్ కేశవరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ పసుపుల హేమావతి, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు పసుపుల కదిరప్ప, గవ్వల పరంధామ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, నాయకులు ఎమ్మెల్యేకు విద్యాసామగ్రి,మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఫక్కీరప్పకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి బొకే అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. బి.యాలేరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు.

అనంతపురం రూరల్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చియ్యేడు కృష్ణారెడ్డి, ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఉప్పరపల్లి సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూపొందించిన 2023 కేలండర్‌ను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. రాప్తాడు మండలంలో నూతన సంవత్సరాన్ని ఎక్కువ మంది చర్చిలు, ఆలయాల్లో పూజలతో ప్రారంభించారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్‌ను జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యురాలు ఖమర్‌తాజ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్రను వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు బషీర్, రామాంజినేయులు, రామకృష్ణ కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్ నివాసంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, బీసీ సంఘాల నాయకులు జోగి రాజేంద్ర, విష్ణు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ మైరెడ్డి నీరజ ఆధ్వర్యంలో వేడుకలను జరుపుకున్నారు.

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, సీఈవో ఏబీ రామ్ ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు దినేష్‌కుమార్, సుఖదేవబాబు, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం అగ్రికల్చర్: డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్‌గా ఇటీవల నియమితుడైన గద్దె కేశవరెడ్డి అనంతపురం, రాప్తాడు, శింగనమల ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే బి.గురునాథరెడ్డి తదితరులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయగిరిజమ్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఈఈ రవికుమార్, డీఈఈ భాస్కర్‌రెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.





అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్,జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం





ఎంపీ గోరంట్ల మాధవ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆలయాల్లో నూతన సంవత్సర సందడి

అనంతపురం కల్చరల్: నగరంలోని రెవెన్యూకాలనీలోని కోదండరామాలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరకోదండరామాలయం, రామనగర్‌లోని పెద్దమ్మ ఆలయం, హౌసింగ్‌బోర్డు, ఆర్ఎఫ్‌రోడ్డు, శ్రీనివాసనగర్‌లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. సాయి మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని పలు చర్చిల్లో నూతన సంబరాలు చేసుకున్నారు. స్థానిక అరవిందనగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చి, సప్తగిరి సర్కిల్ ఎస్ఐయూ, అరవిందనగర్ సీఎస్ఐ చర్చిల్లో కోర్టురోడ్డులోని గాస్పెల్ మందిరం తదితర చోట నూతన సంవత్సర సామూహిక ప్రార్థనలు చేశారు.

ఎస్కేయూలో సంబరాలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నూతన సంవత్సర దినోత్సవ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డికి వర్సిటీ ఉద్యోగులు, బోధన సిబ్బంది, విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదిలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని వీసీ ఆకాంక్షించారు. రాష్ట్రభాషోపాధ్యాయ సంస్థ 2023 సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానంద రెడ్డి, జిల్లా గౌరవ సలహాదారులు రొద్దం రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు వై.ఆదిశేషయ్య, జిలా ప్రధాన కార్యదర్శి జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.ఎస్సీ, ఎస్టీ ,హెచ్ఎం అండ్ ఎంఈఓ అసోసియేషన్ - 2023 క్యాలెండర్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ హెచ్ఎం, ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న పెద్దమ్మ తల్లి



ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డిని అభినందిస్తున్న ప్రొఫెసర్లు



విద్యాలయమే దేవాలయం..

తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన విద్యాలయాన్ని అభివృద్ధి చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. 8లో



జాతీయ స్థాయిలో రాణించాలి

జాతీయస్థాయి జానపద నృత్య పోటీల్లోనూ రాణించాలని ఆర్ట్స్‌కళాశాల విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

31.9°/15.1°

జిల్లా అంతటా ఆదివారం చలి తీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

న్యూస్‌రీల్

7న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న అనంతపురంలోని జెడ్పీ సమావేశ భవన్‌లో నిర్వహించనున్నట్లు సీఈఓ భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరవుతారని వెల్లడించారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలు, ఆ తరువాత జరిగిన ప్రగతికి సంబంధించి సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉన్నందున రెండు జిల్లాల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

తహసీల్దార్ ఉషారాణికి తప్పిన ప్రమాదం



బస్ షెల్టర్‌లోకి దూసుకుపోయిన తహసీల్దార్ ఉషారాణి కారు

గార్లదిన్నె: తహసీల్దార్ ఉషారాణికి త్రుటిలో ప్రమాదం తప్పింది. నూతన సంవత్సరం తొలి రోజున ఈ ఘటన జరిగింది. ఆదివారం ఉదయం ఆమె అనంతపురం నుంచి గార్లదిన్నెకు కారులో బయల్దేరారు. బి.కొత్తపల్లి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడిని తప్పించే క్రమంలో ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనకే వస్తున్న తహసీల్దార్ కారు డ్రైవర్ అప్రమత్తమై స్టీరింగ్ పక్కకు తిప్పాడు. ఈ హఠాత్పరిణామంతో వెనుక వేగంగా వస్తున్న మరొక కారు అదుపుతప్పి ఢీకొట్టడంతో తహసీల్దార్ కార్ పక్కనే ఉన్న బస్ షెల్టర్‌లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న తహసీల్దార్ ఉషారాణికి ఎటువంటి గాయాలూ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కర్ణాటక మద్యంతో పట్టుబడిన ఉపసర్పంచ్

బొమ్మనహాళ్/బెళుగుప్ప: కర్ణాటక మద్యం తరలిస్తూ టీడీపీ మద్దతుదారుడైన ఆవులెన్న ఉపసర్పంచ్ దూదేకుల మస్తాన్‌వలి పోలీసులకు పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. కర్ణాటక నుంచి 32 టెట్రాప్యాకెట్ల మద్యంతో ద్విచక్రవాహనంలో వస్తున్న ఉప సర్పంచ్‌ను ఆవులెన్న గ్రామ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మద్యం స్వాధీనం చేసుకుని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ రామకృష్ణయ్య హెచ్చరించారు.

హనుమాన్ ఆలయంలో విదేశీయుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న విదేశీయులు

పుట్టపర్తి టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుట్టపర్తిలోని హనుమాన్ ఆలయంలో విదేశీ భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ వాతావరణం వైదొలిగి శాంతి నెలకొనాలంటూ సంస్కృతంలోని గణేష్ స్తోత్రం, శివస్తోత్రం, గాయత్రి మంత్రాన్ని జపించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సత్యసాయి భక్తురాలు, కజికిస్తాన్‌కు చెందిన రస్లానా నేతృత్వం వహించారు.



అనంతపురంలో వృద్ధురాలు పార్వతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రెహానా



ఆత్మకూరులో సీఎం జగన్ చిత్రపటంతో పింఛన్‌దారు ఆనందం



రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం తిమ్మాపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

అమితానందం

- పండుగలా పింఛన్ల పంపిణీ
- పింఛన్ పెంపుపై హర్షాతిరేకాలు
- గౌరవప్రదమైన జీవితం సాకారం



బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండలో పింఛన్‌దారులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

అనంతపురం సెంట్రల్: పడిగాపులు.. ఎదురు చూపుల బాధ పోయింది. పొలంలో ఉన్నా.. పనుల్లో ఉన్నా.. అవసరాల నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లినా.. ఆందోళనపడాల్సిన అవసరం లేదు. ఎక్కడ ఉన్నా అక్కడకు వలంటీర్ ద్వారా పింఛన్ చేరుతోంది. ప్రభుత్వ ఉద్యోగి అందుకునే జీతం లాగా ఒకటో తేదీనే ఠంచన్‌గా అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, మత్స్యకార, చర్మకార, కల్లుగీత కార్మికులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందుతోంది. పాదయాత్రలో ఇచ్చిన మాట, ఎన్నికల మేనిఫెస్టోలోని హామీని జగనన్న ప్రభుత్వం నిలబెట్టుకుంటూ బాసటగా నిలుస్తోంది. ఎన్నికల సమయంలో ఉన్న రూ.2వేల పింఛన్‌ను దశలవారీగా రూ.3వేలకు పెంచుతామన్న హామీని మూడో ఏడాదీ అమలు చేసింది. రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన పింఛన్‌ను ఆదివారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తలుపుతట్టి 'పింఛన్' అంటూ డబ్బు అందజేశారు. నాడు పింఛన్ కోసం ఎన్ని అగచాట్లు పడ్డామో తలచుకుని.. నేడు ఉన్న చోటుకే వచ్చి ఇస్తున్న పింఛన్ విధానాన్ని బేరీజు వేసుకుని లబ్ధిదారులు అమితానందభరితులయ్యారు. పింఛన్ పెంపుతో తమకు సామాజిక భద్రతతో పాటు గౌరవం మరింత పెంచిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపి.. చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. జనవరి నెలకు సంబంధించి 2,79,309 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. కొత్తగా 10,143 మందికి పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రూ.77.97 కోట్ల పింఛన్ నిధులు విడుదలయ్యాయి. తొలిరోజు బుక్కరాయసముద్రం 86.52 శాతం, పామిడి అర్బన్ 85.30, నార్పల 84.68, అనంతపురం అర్బన్ 84.20, శింగనమల 83.46, పెద్దవడుగూరు 82శాతం, పుట్లూరు, ఉరవకొండ 81.61శాతం, తాడిపత్రి అర్బన్, గుంతకల్లు అర్బన్, రాయదుర్గం అర్బన్, గుత్తి అర్బన్‌లో 80 శాతంతో పింఛన్ల పంపిణీలో ముందంజలో ఉన్నాయి. రాప్తాడు 53.78, ఆత్మకూరు 55.19, బ్రహ్మసముద్రం 62.79, రాయదుర్గం 62 శాతంతో తర్వాతి స్థానంలో ఉన్నాయి.

పింఛన్ల పెంపుతో నూతనోత్సాహం

బ్రహ్మసముద్రం : పింఛన్ మొత్తం పెంపుతో లబ్ధిదారుల్లో నూతనోత్సాహం కనిపిస్తోందని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం బ్రహ్మసముద్రం మండలం తీటకల్లు పంచాయతీ కుర్లగుండ గ్రామంలో మంత్రి పింఛన్ పంపిణీ చేశారు. పింఛన్ పెరగడంతో అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర లబ్ధిదారుల మోములో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. సీఎం జగనన్న మాట ఇచ్చాడంటే కచ్చితంగా నెరవేరుస్తాడన్నారు. పెన్షన్‌ను దశలవారీగా రూ.3 వేలకు పెంచుకుంటూ పోతామని చెప్పిన హామీని మూడో ఏడాది కూడా అమలు చేశారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును పింఛన్‌దారులతో కలిసి మంత్రి కట్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ వెంకటనాయుడు, ఎంఈఓ ఓబుళపతి, ఏపీఓ అప్పస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు కవితమ్మ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడో తేదీ వరకు పింఛన్ల పండగ



పింఛన్ రూ.2750కు పెంచడంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వెల్లివిరుస్తున్నాయి. కొత్తగా మంజూరైన 10,143 పింఛన్లు కూడా ఈ నెల నుంచి అందిస్తున్నాం. మండల, మున్సిపల్ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నాం. తొలిరోజు 82.03 శాతం మందికి పింఛన్ అందించాం. ఏడో తేదీ వరకు పింఛన్ల పండుగ కొనసాగుతుంది. ఆలోపే వంద శాతం పంపిణీ పూర్తి చేస్తాం.

– నరసింహారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

భవితకు ప్రాతి'పది'క

- డిజిటలైజేషన్‌లో నామినల్ రోల్స్
- నమోదులో అప్రమత్తంగా ఉండేలా నిర్దేశం
- జిల్లాలో మొత్తం టెన్త్ విద్యార్థులు 32,493 మంది



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

అనంతపురం: విద్యార్థికి పదో తరగతి కీలకమైన మలుపు. బంగారు భవితకు తొలి మెట్టు... ఉన్నత విద్యకు సోపానం. పదో తరగతి మార్కులే భవిష్యత్‌కు ప్రాతిపదిక. ఈ క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులూ అప్రమత్తంగా ఉండాల్సిందే. అందుకే నామినల్ రోల్స్ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ నెల ఎనిమిదో తేదీలోపు రూ.500 అపరాధ రుసుముతో పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపునకు తుది గడువుగా నిర్దేశించారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు జరగనున్నాయి. నామినల్ రోల్స్ సైతం జనవరి 9లోపు అందించాల్సి ఉంటుంది. విద్యార్థుల సమగ్ర వివరాలను (నామినల్ రోల్స్) ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. నామినల్ రోల్స్‌ను డిజిటలైజేషన్ చేసే విధానానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పరీక్షల విభాగం రూపకల్పన చేసిన ఇన్‌స్ట్రక్షన్ మ్యానువల్‌ను ప్రధానోపాధ్యాయులకు పంపింది. విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, వివరాల నమోదులో చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించింది. పదో తరగతి విద్యార్థుల ఫీజుల చెల్లింపు, నామినల్ రోల్స్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగానికి ఆయా పాఠశాలల వారీగా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ప్రధానోపాధ్యాయులు సైట్‌లో లాగిన్ అయ్యి విద్యార్థుల వారీగా పరీక్ష ఫీజు చెల్లించాలి. దీంతో పాటు నామినల్ రోల్స్‌నూ తిరిగి అదే సైట్‌లో అప్‌లోడ్ చేసి, హార్డ్ కాపీలను గడువులోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాల్సిన అవసరం లేదు. . అనంతపురం జిల్లాలో మొత్తం 32,493 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

నామినల్ రోల్స్ నమోదు విధి విధానాలు..

- విద్యార్థి ఆధార్‌కార్డులో తప్పిదాలు ఉంటే తల్లిదండ్రులు ఇచ్చిన డిక్లరేషన్ ఆధారంగా వివరాలు నమోదు చేయాలి.
- ఇపుడు నమోదు చేసిన వివరాలే, పరీక్ష ఫలితాల అనంతరం ప్రభుత్వం విడుదల చేసే మార్కుల జాబితాలో పొందుపరుస్తారు. విద్యార్థి తదుపరి చదువుకు, విదేశీ చదువులకు, ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మార్కుల జాబితానే ప్రాతిపదిక. ఆ తర్వాత తప్పుల సవరణ కష్టంతో కూడుకున్న పని.
- విద్యార్థి తల్లిదండ్రులు ఇప్పుడే పాఠశాలకు వెళ్లి తమ పిల్లల వివరాలు సరిగా నమోదు చేశారా? లేదా? ధ్రువీకరించుకోవడం మంచిది.
- విద్యార్థి పేరు, ఇంటి పేరును ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా నమోదు చేయాలి. విద్యార్థి తల్లి ఇంటిపేరునూ రాయాలి.

తల్లిదండ్రులకు పంపుతాం



నామినల్ రోల్స్‌ను డిజిటలైజేషన్ చేస్తున్నాం. నామినల్ రోల్స్‌ను బోర్డ్‌కు అందించే ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులకు పంపి.. అందులోని వివరాలను అంగీకరిస్తూ డిక్లరేషన్ తీసుకున్న తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం . అనంతరం మ్యానువల్ నామినల్ రోల్స్ (ఎంఎస్ఆర్)ను విద్యాశాఖ కార్యాలయానికి పంపాల్సిన అవసరం లేదు.

– గోవిందనాయక్ , ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, అనంతపురం

రేషన్ బియ్యం స్వాధీనం

రాప్తాడు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ సాయి ప్రసాద్, రాప్తాడు తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు తెలిపిన మేరకు... పేదల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అనంతపురం నగర శివారులోని ధర్మవరం పంగల్ రోడ్డు వద్ద ఉన్న శ్రీనివాస మోడరన్ రైస్‌మిల్ యజమాని సురేష్‌కుమార్... తన మిల్లులో వాటిని పాలిష్ చేసి బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం బెంజ్ కంటైనర్‌లో 26 కిలోల బరువున్న 1,150 బస్తాల బియ్యం ప్యాకెట్లను బెంగళూరుకు తరలిస్తుండగా రాప్తాడు మండలంలోని కందుకూరు క్రాస్ వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విచారణలో శ్రీనివాస మోడరన్ రైస్ మిల్లు నుంచి బియ్యాన్ని తరలిస్తున్నట్లు డ్రైవర్ అంగీకరించడంతో విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని తనిఖీ చేపట్టారు. మిల్లులో 50 కిలోల బరువున్న 15 బస్తాలు, 12 కిలోల బరువున్న మరో వెయ్యి బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి, సీజ్ చేశారు. యజమానికి సంబంధించిన కారును ఆధీనంలోకి తీసుకుని రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని అనంతపురం సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. రైస్ మిల్లు యజమాని సురేష్‌కుమార్‌తో పాటు అక్కడ పని చేస్తున్న అల్లాబకాష్, జయపాల్‌రెడ్డి, మహేష్ బాబు, వరప్రసాద్, శివయ్యను అరెస్ట్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ శేషగిరి, ఏఈఈ కుళ్లాయిరెడ్డి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం తరలిస్తున్న లారీని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు



విద్యుద్దీపాలంకరణలో పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం

ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం మోక్ష ప్రాప్తినిస్తుందన్న విశ్వాసముండటంతో ఆదివారం అర్ధరాత్రి నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. అనంతపురం పాతూరు చెన్నకేశవ స్వామి, ఆర్‌ఎఫ్‌రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పోలీసు బందోబస్తు నడుమ ఉత్తర ద్వార దర్శనం రాత్రి 12 గంటలకు ప్రారంభించారు.

– అనంతపురం కల్చరల్:

జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దాం





కలెక్టర్ నాగలక్ష్మికి శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ ఫక్కీరప్ప, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: సమష్టిగా పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులు, సిబ్బందికి సూచించారు. నూతన సంవత్సరంలో మరింత నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఆదివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. డీఆర్వో గాయత్రీదేవి, పరిపాలనాధికారి విజయలక్ష్మి, ఆర్డీఓలు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘునందన్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నీరజ, డీటీసీ శివరామప్రసాద్, సమాచార శాఖ అధికారి గురుస్వామి శెట్టి, జేడీఏ చంద్రానాయక్, గృహనిర్మాణ శాఖ పీడీ కేశవనాయుడు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆహ్లాదకర వైద్యం





అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్నపిల్లల (పీడియాట్రిక్) విభాగం వివిధ రకాల చిత్రాలతో నూతన శోభను సంతరించుకుంది. చిన్నారుల దినచర్య.. ఆరోగ్య సూత్రాలు.. ఆహార నియమాలు.. చదువు.. క్రీడల ప్రాముఖ్యత.. చోటా భీమ్, స్పైడర్‌మేన్, టామ్ అండ్ జెర్రీ కార్టూన్లను గోడలపై అందంగా చిత్రీకరించారు. అడ్మిషన్‌లోని చిన్నారులు ఈ బొమ్మలను చూస్తూ సంతోషంగా వైద్యం చేయించుకుంటున్నారు. ఆస్పత్రిలో పరిశుభ్రత.. సుందరీకరణ కట్టి పడేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



సిబ్బందితో కలసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తన చాంబర్‌లో సిబ్బందితో కలసి ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, హనుమంతు, ఎస్‌బీ సీఐలు చక్రవర్తి, ఇందిర, టెక్నికల్ ఎస్‌ఐ సుధాకరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



సీజ్ చేసిన కర్ణాటక మద్యం బాక్సులు చూపుతున్న సెబ్ అధికారులు

ఎన్‌పీకుంట: జిల్లాలోకి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడినట్లు సెబ్ సీఐ రామ్మోహన్ తెలిపారు. అందిన ముందస్తు సమాచారం మేరకు ఎన్‌పీకుంట మండలం ఎదురుదొన వద్ద ఆదివారం సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన సుజుకీ స్విఫ్ట్ డిజైర్ కారును ఆపి పరిశీలించడంతో అందులో 20 బాక్సుల్లో 1,920 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. మద్యాన్ని తరలిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఎదురుదొన నివాసి పెడబల్లి నాగరాజును అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సెబ్ ఎస్‌ఐ శ్రీలేఖ, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, సిబ్బందిని ఈ సందర్భంగా సీఐ రామ్మోహన్ అభినందించారు.

రాష్ట్రస్థాయి షటిల్ విజేతగా జాల నక్షత్ర



జాల నక్షత్రను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ విజేతగా కృష్ణవేణి పాఠశాల విద్యార్థిని జాల నక్షత్ర నిలిచింది. గత నెల 26 నుచి 28 వరకు మదనపల్లిలో నిర్వహించిన అండర్-14 స్కూల్ గేమ్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారిణిని ఓడించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌స్వామి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యాలయమే దేవాలయం

- యాడికి జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల అపురూప కానుకలు
- బ్యాచ్‌ల వారీగా పోటీ పడిన పూర్వ విద్యార్థులు
- 1955 బ్యాచ్ మొదలు 2021-22 బ్యాచ్ వరకూ భారీగా విరాళాలు
- ఆర్డీటీ సహకారంతో రూ.60 లక్షల వ్యయంతో 13 నూతన గదుల నిర్మాణం



గ్రామ ప్రజలు, ఆర్డీటీ సహకారంతో నిర్మించిన 13 అదనపు తరగతి గదులు



సీఐ కంబగిరి రాముడు ఏర్పాటు చేయించిన అంబేడ్కర్ విగ్రహం

యాడికి: తమ ఉన్నతికి కారణమైన పాఠశాలను పవిత్రమైన ఆలయంగా భావించిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఒకట్రెండు ఏళ్ల కాదు.. దాదాపు 68 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన వారి నుంచి గత విద్యా సంవత్సరం వరకూ పూర్వ విద్యార్థులు బ్యాచ్‌ల వారీగా పోటీ పడి పాఠశాల అభివృద్ధికి తగిన సహకారం అందిస్తున్నారు. పూర్వ విద్యార్థుల చొరవతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ఆ పాఠశాలనే... యాడికిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.

నాటి నుంచి నేటి వరకూ..

యాడికిలో 1950లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభమైంది. ఈ పాఠశాల మౌలిక వసతుల కల్పనకు 1958-59 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల మొదలు 2021-22 విద్యాసంవత్సరం విద్యార్థుల వరకూ అందరూ ఇతోధికంగా సహకారం అందిస్తూ వచ్చారు. అంతకు ముందు ఓ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నిర్వహించిన సమ్మేళన కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి కార్యాచరణను రూపొందించారు. అంతేకాక ఆ కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసి మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఈ ప్రేరణతో మిగిలిన బ్యాచ్‌ల విద్యార్థులు సైతం పాఠశాల అభివృద్ధికి పోటీ పడ్డారు. ఇలా ఇప్పటి వరకూ 30 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు దాదాపు రూ.60 లక్షలకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు.

పూర్వ విద్యార్థులు నిర్వహించిన అభివృద్ధి పనులు ఇవే..

- 2003-04 బ్యాచ్ విద్యార్థులు కుర్చీలు అందజేశారు.
- 2007-08 బ్యాచ్ విద్యార్థులు రూ.20వేలు విలువ చేసే రెండు ప్రింటర్లు ఇచ్చారు.
- 1993-94 బ్యాచ్ విద్యార్థులు ఓ షెడ్ ఏర్పాటు చేశారు.
- ఈ పాఠశాల పూర్వ విద్యార్థి నిట్టూరుకు చెందిన కంబగిరి రాముడు (ప్రస్తుతం కర్నూలు జిల్లాలో సీఐగా పనిచేస్తున్నారు) అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.
- ఈ పాఠశాల పూర్తి విద్యార్థి లోకేశ్వరరెడ్డి... ఇతే పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న సమయంలో స్థానికులు, ఆర్డీటీ సహకారంతో 13 అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయించారు.
- యాడికికి చెందిన పూర్వ విద్యార్థి మహేశ్వర రెడ్డి రూ.3లక్షల వ్యయంతో స్టేజ్ ఏర్పాటు చేయించారు.
- మరికొందరు పూర్వ విద్యార్థులు చదువుల తల్లి సరస్వతి, విన్సెంట్ ఫెర్రర్, మౌలానా అబూల్ కలాం ఆజాద్ విగ్రహాలను ఏర్పాటు చేయించారు.

ఏదైనా చేయాలనిపించింది



యాడికి ఉన్నత పాఠశాలలో 1958-59లో పదో తరగతి చదివాను. 1964లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యా వృత్తిని ఇక్కడే చేపట్టాను. 1979-85 వరకు ఇక్కడే పని చేశా. 1991లో తిరిగి ప్రధానోపాధ్యాయుడిగా ఇదే పాఠశాలలో బాధ్యతలు చేపట్టి 1996లో ఉద్యోగ విరమణ పొందాను. ఇంత అరుదైన అవకాశం ఏ ఉపాధ్యాయుడికీ రాదు కూడా. అందుకే నేను చదువుకున్న పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలబడకుండా 50 ట్రాక్టర్ల మట్టి తోలించి చదును చేయించా.

– కె.విజయభాస్కరరెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం, 1958-59 బ్యాచ్ విద్యార్థి

స్పందన అభినందనీయం



ఈ పాఠశాలలో చదువుకున్న వారి స్పందన నిజంగా అభినందనీయం. పాతిక, 30 సంవత్సరాల క్రితం ఇక్కడ చదువుకున్న వారంతా నేటికీ పాఠశాలపై చూపిస్తున్న మమకారం మాటల్లో చెప్పలేను. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని మరీ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

– విజయమ్మ, హెచ్‌ఎం, యాడికి జెడ్పీహెచ్‌ఎస్

జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 3, 4 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలుర విభాగంలో ముఫయాజ్, పుష్పరాజ్, కృష్ణకుశాల్, మంజునాథ్, నవనీత్, చరణ్, జీవన్‌సాయి, రామకృష్ణ, శేషసాయి, చిన్మయి శ్రీవాస్తవ్ ఉన్నారు. అలాగే బాలిక విభాగంలో ముస్కాన్, బసంతి, త్రివేణి, కావ్యశ్రీ, జోష్ణవి, దీక్షిత, ప్రణవి ఉన్నారు.

మహిళ బలవన్మరణం

బత్తలపల్లి: ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి మండలం కోటన్నగారిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ(53)ను భర్త గొడుచెరువు నారాయణరెడ్డి వదిలేయడంతో తమ్ముని వద్దనే జీవిస్తోంది. పిల్లలు లేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను గత ఏడాది డిసెంబర్ 29న అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. అక్కడ భోజన సమయంలో ఆమె కనిపించకుండా పోయింది. దీంతో అదే రోజు అనంతపురం రెండో పట్టణ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బత్తలపల్లి మండలం కట్టకింద పల్లి చెరువులో ఓ మహిళ మృతదేహాన్ని పశువుల కాపర్లు గుర్తించి, సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. ఆభరణాలన్నీ అలాగే ఉన్నాయి. పర్సులో ఉన్న ఆధారాల మేరకు విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు వచ్చి పరిశీలించి, మృతురాలిని వెంకటరమణమ్మగా నిర్ధారించారు. అనారోగ్య సమస్య, సంతానం లేకపోవడంతో భర్త దూరమవ్వడంతో మనస్తాపం చెంది ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష తెలిపారు.

యువకుడి ఆత్మహత్య..

రాయదుర్గం టౌన్: ఆర్మీలో జవాన్‌గా ఎంపిక కాలేకపోయానన్న ఆవేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని భంభంస్వామి ఆశ్రమానికి వెళ్లే దారిలో నివాసముంటున్న యత్రాసి శివరామ్, లత దంపతుల ఏకైక కుమారుడు అరవింద్ (22) ఏడాది క్రితం డిగ్రీ పూర్తి చేశాడు. ఎప్పటికైనా భారత పదాతిదళంలో జవాన్‌గా ఉద్యోగం చేయాలని కలలు కనేవాడు. ఈ క్రమంలో ఆర్మీ సెలక్షన్‌కు హాజరయ్యారు. అయితే ఫిట్‌నెస్ లేని కారణంగా ఉద్యోగానికి ఎంపిక కాలేకపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన అరవింద్.. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రాయదుర్గం సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టారు.

'జీవనరేఖ'పై చైతన్య పరచండి

- వ్యవసాయాధికారులకు డీఏఓ చంద్రానాయక్ సూచన
- అన్నదాతల ఆత్మహత్యల నివారణకు 08554-29732 హెల్ప్‌లైన్



డీఏఓ చంద్రానాయక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యవసాయాధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రైతుల్లో ఆత్మస్థైర్యం పెంపొందేలా జాయింట్ కలెక్టర్ జేసీ కేతన్‌గార్గ్ ఆవిష్కరించిన 'జీవనరేఖ' హెల్ప్‌లైన్ నంబర్‌పై అన్నదాతలకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ జిల్లా అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ ఆదేశించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందితో కలసి ఆయన కేక్ కట్ చేశారు. ఆయనకు ఏడీఏ, ఏఓ అసోసియేషన్ నాయకులు, మినిస్టీరియల్ స్టాఫ్, డీలర్ల అసోసియేషన్, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేసీ ఆదేశాల మేరకు డీఏఓ కార్యాలయంలో 08554-297328 జీవనరేఖ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీనిపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా రైతులు ఒత్తిడికి లోనై తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారాన్ని హెల్ప్‌లైన్‌కు చేరవేస్తే వెంటనే సంబంధిత గ్రామ, మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేసి బాధిత రైతు, వారి కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం కల్పించాలన్నారు. ఆర్థిక సమస్యలు, వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి ఉపశమనం కలిగించేలా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కౌలు రైతులకూ రైతు భరోసా, పంట రుణాలు లాంటి ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎం.వెంకట్రాముడు, శ్యాంసుందరరెడ్డి, వెంకటేశ్వరప్రసాద్, పి.సోమశేఖర్, వెంకట కుమార్, శుభకర్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన జయంతి అధికారిక నిర్వహణపై హర్షం



మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడంపై ఏపీ రెడ్డి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సాయిఆరామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ రెడ్డి సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాకవి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేలా ఏటా జనవరి 18న వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వ జీఓ జారీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, విద్యార్థి విభాగం కో-ఆర్డినేటర్ నితిన్‌రెడ్డి, ఆదర్శరెడ్డి, హర్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి



మృతి చెందిన ఉస్మాన్

గుంతకల్లు రూరల్: ప్రయాణికులతో వెళుతున్న ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు... గుంతకల్లు మండలం నక్కనదొడ్డి కొట్టాల గ్రామానికి చెందిన దాదాపు 10 మంది ఆదివారం మధ్యాహ్నం ఆటోలో గుంతకల్లుకు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మలుపు వద్ద డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటో డ్రైవర్ షేక్ ఖాసీంవలి, ఉస్మాన్ (33), హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖాసీంవలి, ఉస్మాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం సాయంత్రం ఉస్మాన్ మృతి చెందాడు. మృతుడికి భార్య మున్నీబీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి దుర్మరణం



మృతుడు నాగరాజు

గుంతకల్లు రూరల్: ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని కసాపురం రోడ్డులో ఉన్న అంజలి నగర్‌కు చెందిన నాగరాజు (65).. రైల్వేలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. శనివారం రాత్రి వాకింగ్ ముగించుకుని ఇంటికి వెళుతుండగా అయ్యప్ప స్వామి గుడి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఘటనతో తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితికి చేరుకున్న నాగరాజును గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన సత్యనారాయణపేట కాలనీ నివాసి, ఆటో డ్రైవర్ కేదార్‌నాథ్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



బసప్ప (ఫైల్)

యాడికి: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన బసప్ప(54), ఆ గ్రామ సమీపంలోని బలపం రాయి మైన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నారు. ఆదివారం రాయలచెరువుకు వచ్చిన ఆయన సాయంత్రం పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. రాయలచెరువు శివారులోని రైస్ మిల్లు వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే స్పందించి ఓ ప్రైవేట్ వాహనంలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాలధారుల వినూత్న నిరసన



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి భజనలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

హిందూపురం టౌన్: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్ప మాలధారులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి అయ్యప్ప భజనలు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం బైరి నరేష్ అనే వ్యక్తి అయ్యప్పస్వామి మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను హిందూ సమాజం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వరప్రసాద్, రమేష్, ఆదర్శ్‌కుమార్, శంకర్, గురుస్వాములు ఠాగూర్, తిరుమలేష్, లింగప్ప, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాలధారుల ర్యాలీ

రొద్దం: హిందూ దేవుళ్లను కించపరిచేలా మాట్లాడిన భారత నాస్తిక సమాజం అధ్యక్షుడు బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని ఆదివారం మండల కేంద్రంలో అయ్యప్పస్వామి మాలధారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

- విద్యార్థులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం కల్చరల్: రాష్ట్రస్థాయి సాంస్కృతిక యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యంలో ప్రథమ స్థానం దక్కించుకున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులను కలెక్టర్ నాగలక్ష్మి అభినందించారు. ఆదివారం ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడుతో పాటు తనను కలసిన విద్యార్థులతో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి విష్ణుప్రియ, ఆన్‌సెట్ సిబ్బంది ఉన్నారు.

ఎకరాకు రూ.లక్ష ఆదాయం



ఆలుగడ్డలను మార్కెట్‌కు తరలించేందుకు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- ఆశాజనకంగా ఆలుగడ్డ
- జిల్లాలో 450 ఎకరాల్లో పంట సాగు

పుట్టపర్తి అర్బన్: ఆలుగడ్డల సాగు ఈ ఏడాది రైతులను లక్షాధికారులను చేస్తోంది. సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ సాగు చేసే ఆలుగడ్డ మంచి దిగుబడితో పాటు అధిక ధరలు పలుకుతుంటాయి. అయితే పంట సాగుకు ఖర్చు ఎక్కువే అయినా.. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతుల ఇంట సిరుల వర్షం కురుస్తోంది. ఎకరా విస్తీర్ణంలో రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుండడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

కలిసొచ్చిన వాతావరణం

గత మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. దీనికి తోడు ఖరీఫ్, రబీ సీజన్‌లలో వాతావరణ పరిస్థితులూ బాగా కలిసొచ్చాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 23,104 ఎకరాల్లో వివిధ రకాల ఆకు కూరలు, కూరగాయలను రైతులు సాగు చేశారు. అత్యధికంగా 18,872 ఎకరాల్లో టమాట సాగు చేయగా.. 2,076 ఎకరాల్లో పచ్చి మిరప, 919 ఎకరాల్లో వంకాయ, 450 ఎకరాలో ఆలుగడ్డ, 368 ఎకరాల్లో బెండ, 241 ఎకరాల్లో చిక్కుడు, 94 ఎకరాల్లో క్యాబేజీ పంటలను సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో పంట ఉత్పత్తులను స్థానిక వారపు మార్కెట్లతో పాటు హిందూపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, కొత్తచెరువు తదితర పట్టణ ప్రాంతాల్లోనే దినసరి మార్కెట్‌లు, మదనపల్లి, చెన్నైతో పాటు కర్ణాటకలోని బాగేపల్లి, చింతామణి, బెంగళూరు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ధర అధికంగా ఉండడంతో తోటల వద్దకే వ్యాపారులు వచ్చి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.

ఎకరాకు 150 బస్తాలు

సీజన్‌ను బట్టి ఆలు విత్తన గడ్డ 50 కిలోల బస్తా రూ.2,500 నుంచి రూ.3వేల వరకు ధర పలుకుతోంది. భూమిని దుక్కి చేయడం, గడ్డి తొలగించడం, విత్తనం పెట్టడం, డ్రిప్ ద్వారా ఎరువులు, సాల్లు తీయడం, ఎరువులు పంట చివరన దున్ని గడ్డలను తొలగించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియకు ఎకరా విస్తీర్ణంలో దాదాపు రూ.లక్ష వరకు రైతులు వ్యయం చేశారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. దీంతో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తోటల వద్దకు చేరుకుని పంట కొనుగోళ్లు చేపట్టారు. 40 కిలోల ఆలుగడ్డల బస్తా రూ.1,400తో అమ్ముడు పోతోంది. ఎకరా విస్తీర్ణంలో 150 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. ప్రస్తుత ధరను పోల్చుకుంటే 150 బస్తాలకు రూ.2.10 లక్షలు చేతికి అందుతున్నాయని, పెట్టుబడులు పోను రూ.1.10 లక్షలు మిగులు ఆదాయం ఉంటోందని పెడపల్లి రైతులు జనార్దనరెడ్డి, రోషన్, శివప్ప, సుబ్బరాయనిపల్లి చంద్రాయుడు తెలిపారు.